RNI. No. TELTEL /2022/ 89348



మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తె లు గు ది న ప త్రి క

సంపుటి : 4 సంచిక : 79 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | బుధవారం, మార్చి,11, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-

### హైదరాబాద్ చేరుకున్న కొత్త గవర్నర్ శివప్రతాప్ శుక్లా..

## స్వాగతించిన సిఎం

హైదరాబాద్,మార్చి10 : తెలంగాణకు కొత్తగా నియమితులైన నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ చేరుకున్నారు. ఎయిర్ పోర్టుకు చేరుకున్న సిఎం రేవంత్ తదిత రులున గవర్నర్‌కు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు గవర్నర్‌కు స్వాగతం పలికి వారిలో ఉన్నారు. అనంతరం గవర్నర్ నేరుగా లోక్‌భవన్ చేరుకున్నారు.





### కుంభమేళా తరహాలో

## గోదావరి పుష్కరాలు

- 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు
- 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలు
- 'తెలంగాణ బ్రాండ్' ప్రతిబింబించేలా ఏర్పాట్లు
- వివరాలు వెల్లడించిన క్యాబినెట్ సబ్‌కమిటీ



**హైదరాబాద్,మార్చి,10:** కుంభమేళా తరహాలోనే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని 'గోదావరి పుష్కరాలు 2027' క్యాబినెట్ సబ్ కమిటీ తెలిపింది.మంగళవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన నిర్వహించిన కమిటీ తొలి సమావేశం నిర్వహించింది.సభ్యులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. 'తెలంగాణ బ్రాండ్' మార్మోగేలా... మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిటీ ఆదేశించింది. పుష్కర నిర్వహణ తేదీలు, సంబంధిత శాఖల సన్నద్ధత, భవిష్యత్తు కార్యాచరణను సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ.... సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సరస్వతీ పుష్కరాలు, సమ్మక్క సారక్క జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించిందన్నారు.

అదే స్ఫూర్తితో... మరింత రెట్టించిన ఉత్సాహంతో రాబోయే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు, 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలను నిర్వహించాలని వేద పండితులు నిర్ణయించారన్నారు. సుమారు 8 కోట్ల మంది భక్తులు ఈ పుష్కరాలకు తరలి వచ్చే అవకాశముందని, అందుకు అనుగుణంగానే గోదావరి ప్రవహించే జిల్లాల్లో... ప్రముఖ దేవాలయాలను అనుసంధానిస్తూ... 96 ప్రాంతాలను పుష్కరాల కోసం ప్రత్యేకంగా ఎంపిక చేశామన్నారు. గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆయా చోట్ల క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఘాట్లు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర, జిల్లా ప్రణాళికలను ప్రత్యేకంగా రూపొందిస్తున్నామన్నారు.

### రంగానాయక్ సాగర్‌పై

## ఎందుకీ తాత్సారం

### ఆందోళన చేస్తున్న రైతుల అరెస్ట్ దుర్మార్గం
### మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్



హైదరాబాద్,మార్చి10: రాజన్న సిరిసిల్ల జిల్లాలో రంగనాయక్ సాగర్ కెనాల్ పనులు పూర్తి చేయాలంటూ నిరసనకు దిగిన రైతులను అరెస్ట్ చేయడాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ ఖండించారు. సమస్యలపై ఆందోళన చేస్తే అరెస్ట్ చేస్తారా అని ప్రశ్నించారు. ఇదేనా ప్రజాప్రభుత్వం తీరు అంటూ విమర్శలు గుప్పించారు. మంగళవారం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రైతులు నిరసన చేస్తే వారిని అరెస్ట్ చేస్తారా అంటూ మండిపడ్డారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్, తంగళ్లపల్లి మండలానికి నీళ్లిచ్చే కాలువ పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని కేంద్రమంత్రి ప్రశ్నించారు. రూ.3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది దాటినా పనులు ఎందుకు ప్రారంభించలేదని అడిగారు. కాలువ పనులు పూర్తి చేసి ఉంటే 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నన్నాళ్లు రంగనాయక్ సాగర్ ద్వారా సిరిసిల్ల జిల్లాకు నీరివ్వని కేటీఆర్ రైతు ద్రోహి అని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకుల వైఫల్యాల వల్ల రైతులు వరుసగా పంటలు నష్టపోతున్నారని కేంద్రమంత్రి అన్నారు. తక్షణమే పనులు ప్రారంభించకపోతే ఆయా ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. న్యాయం చేయాలని అడిగిన రైతులను అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. రైతులకు సంఘీభావం తెలిపిన బీజేపీ జిల్లా అధ్యక్షులు గోపీ సహా పార్టీ నాయకులను స్టేషన్‌కు తరలించడం అక్రమమని కేంద్రమంత్రి తీవ్రంగా మండిపడ్డారు. రైతులపై కేసులు నమోదు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తక్షణమే రైతులను, బీజేపీ నేతలను బేషరతుగా విడుదల చేయాలన్నారు.

రంగనాయక్ సాగర్ 11వ ప్యాకేజీ నుంచి ఎల్ఎం 4, ఎల్ఎం 6 ద్వారా కాలువ పనులనుపూర్తి చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

## పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

### - వేసవి ప్రారంభంలోనే తీవ్రమైన ఎండలు - మార్చిలోనే తీవ్రమైన ఉక్కపోత



ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 10 : జిల్లాలో గత కొన్ని రోజులుగా విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. జిల్లాలో విద్యుత్ డిమాండ్ కూడ రికార్డు స్థాయికి చేరుకుంది. ఈనెల 2వ తేదీన అత్యధికంగా రికార్డు స్థాయిలో 1.735 మీలియన్ యూనిట్ల డిమాండ్ నమోదైందని అదికారులు వెల్లడించారు. అయితే పెరుగుతున్న వినియోగం ఉన్నప్పటికీ జిల్లాలో ఎలాంటి అంతరా యాలు లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగిస్తున్నా మని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ లైన్లు ఏర్పాటు చేయడం కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించడం, ఫీడర్ల విభజన చేయడం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడం వంటి చర్యలతో నిరంతర విద్యుత్ సరఫరా అందించగలుగుతున్నామని చెబుతున్నారు. వాతావరణంలో మా ర్పులు రావడంతో విదు ?యత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖ సిబ్బంది అప్రమత్తంగా పనిచేస్తున్నారని తెలిపారు. వినియోగదారులకు ఎలాంటి సమస్యలు ఎదురై నా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా ఏఈలను సంప్రదించాలని అధికారులు సూచించారు. జిల్లాలో 1,77,479 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 1,41,942 గృహ, 15,004 వాణిజ్య, 633 పరిశ్రమలు, 15,258 వ్యవసాయ కనెక్షన్లతో పాటు వివిధ రకాల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతిరోజు 17.35 లక్షల యూనిట్ల వినియోగం కాగా ప్రభుత్వా నికి రూ కోటి ఆదాయం సమకూరుతుంది. జిల్లాలో ని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, కౌటాలలో 132/33 కేవీ సబ్ స్టేషన్లు ఉండగా, 33/11 సబ్‌స్టేషన్లు 34 ఉన్నాయి.

### నన్ను ఒక ఉగ్రవాదిలా

## అరెస్ట్ చేశారు..



### వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడ్డ తనను అరెస్ట్ చేశారన్న కవిత
### అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడంపై కవిత ఆగ్రహం
### ఇళ్లను కూల్చివేసిన చోటే కొత్త ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్,మార్చి10: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారు. నిరాహార దీక్షకు దిగిన తనను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పేదల కోసం గళమెత్తిన తనను ఒక ఉగ్రవాదిలా భావించి అరెస్ట్ చేశారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన కవిత,వెలుగుమట్లలో పేదలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను అధికారులు కర్కశంగా కూల్చివేసిన తీరును తప్పుబట్టారు. భూదాన్ భూములు అంటేనే పేదలకు ఇచ్చేవి అని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆభూములను పెద్దలకు కట్టబె ట్టేందుకే ఇలాంటి దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. కూల్చివేసిన చోటే మళ్లీ ఇళ్లను నిర్మించిబాధితులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ, ఖమ్మంలో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న తీరును గమనించాలని కవిత సూచించారు. ఈ అన్యాయంపై ఆయనకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. బాధితుల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఉన్నారని, పరీక్షల సమయంలో వారిని రోడ్డున పడేయడం కలెక్టర్, జిల్లా మంత్రులకు కనిపించడం లేదా? అని ఆమె నిలదీశారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని, అవసరమైతే కోర్టులో పిల్ వేసి న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

### ప్రభుత్వానికి తలవంచని

## ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

### నెహ్రూను విమర్శించే బీజేపీ నేతలే ఇప్పుడు ఆయన్ను ఉటంకిస్తున్నారని చురక
### స్పీకర్ ఓం బిర్లా తొలగింపు తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రియాంక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,మార్చి,10:** లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని గట్టిగా సమర్థించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి తలవంచకుండా నిలబడిన ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ అని ఆమె కొనియాడారు. మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలంటూ ప్రవేశపెట్టిన తీర్మానంపై జరిగిన చర్చలో ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. సభకు అధ్యక్షత వహిస్తున్న ప్యానెల్ స్పీకర్ కృష్ణ ప్రసాద్ తెన్నేటి అనుమతితో ప్రియాంక మాట్లాడారు. ఈ సందర్భంగా అధికార పక్షంపై ఆమె చురకలు అంటించారు. "ప్రతిరోజూ నెహ్రూజీని విమర్శించే వారే, ఈ రోజు ఆయనను ఉటంకించడం చూసి నాకు నవ్వొచ్చింది. ఒక్కసారిగా వారికి నెహ్రూజీపై గౌరవం పుట్టుకొచ్చింది. ప్రజాస్వామ్యాన్ని అత్యంత బలోపేతం చేసింది నెహ్రూజీనే అని ఇప్పుడు చెబుతున్నారు" అని ప్రియాంక వ్యాఖ్యానించగా, ప్రతిపక్ష సభ్యులు బల్లలు చరుస్తూ మద్దతు తెలిపారు. అనంతరం రాహుల్ గాంధీని సమర్థిస్తూ, "గత 12 ఏళ్లుగా ఈ ప్రభుత్వం ముందు తలవంచని వ్యక్తి ఈ దేశంలో ఒక్కరే ఉన్నారు. ఆయనే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. ఎందుకంటే లోక్‌సభ నాయకుడు నిజం మాట్లాడటానికి వెనుకాడరు. కానీ, వారు (ప్రభుత్వం) నిజాన్ని జీర్ణించుకోలేరు" అని ప్రియాంక అన్నారు. అంతకుముందు, స్పీకర్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు స్పందించారు. రాజ్యాంగం ప్రకారం చట్టాలు, నిబంధనలకు అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ కట్టుబడి ఉండాలని అన్నారు. "ఏ వ్యక్తి అయినా తనను తాను అన్నింటికీ అతీతుడిగా భావించినప్పుడు, అతడిని నిలదీయడం చాలా ముఖ్యం" అని రాహుల్ గాంధీని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

# సంపాదకీయం

## పరస్పర విమర్శలతో ఒరిగేదేమిటి..?

తెలంగాణ రాజకీయాలు గమ్మత్తుగా సాగుతున్నాయి. కెసిఆర్ విమర్శలు, సిఎం రేవంత్ ప్రతి విమర్శలు జుగుప్సాకరంగా ఉన్నాయి. పరస్పర విమర్శలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదు. రెండేళ్లు దాటినా కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతి విచారణలు, చర్యల్లో ఒక్క అడుగు కూడా పడలేదు. విచారణల పేరుతో కాలయాపన తప్ప మరోటి కానరావడం లేదు. ఏతావాతా రాజకీయ నాయకుల అవినీతిని పరస్పరం భరించే ఒప్పందాలు జరిగాయా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మొత్తానికి విభజన తరవాత తెలంగాణ దగా పడ్డదన్నది నిజం. అన్నింటికి మించి తెలంగాణ వ్యవహారాలను ప్రజలనుంచి దూరం చేసి మూడు పార్టీలు ఆటలాడుతు న్నాయి. కాంగ్రెస్ మీద బిఆర్ఎస్, బిఆర్ఎస్ మీద కాంగ్రెస్, ఈ రెండింటిపై బిజెపిలు విమర్శలు చేసుకోవడం పరిపటిగా మారింది. ప్రజలకు మంచి చేద్దామన్న ఆలోచన ఒక్కరికీ లేదు. రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేసి, మళ్లీమళ్లీ అప్పులు చేస్తున్నారు. అవసరం లేని ఖర్చులనే ప్రస్తావిస్తున్నారు. రాజకీయంగా తామే బలంగా ఉండాలని, తామే పాలించాలన్న ఆలోచన తప్ప మరోటి కానరావడం లేదు. కెసిఆర్ హయాంలో జరిగిన అప్పుల గురించి కెసిఆర్ కూడా మాట్లాడడం లేదు. జరిగిన తప్పులు, అప్పులకు ఎవ్వరు కూడా బాధ్యత వహించడం లేదు. ఇదంతా ప్రజల ఖర్మకు వదిలేశారు. ఇకపోతే కెసిఆర్ తనయ ఇప్పుడు స్వతంత్రంగా రాజకీయాలు చేస్తున్నారు. బిఆర్ఎస్ బహిష్కరించాక ఆమెకు ఇప్పుడి ప్పుడే జ్ఞానోదయం అవుతోంది. పదేళ్ల పాలనా కాలంలో తాను నిమిత్త మాత్రురాలినని అంటున్నారు. అన్నింటికి మంచి ఆమె ఎక్కడికి వెళ్లినా సమస్యలు స్వాగతిస్తున్నాయి. ఆమె ఇవన్నీ చూసి ఆశ్చర్యంతో పాటు క్షమాపణలు చెబుతున్నారు. తనతండ్రి పదేళ్ల కాలంలో బంగారు తెలంగాణ అన్నది జరగలేదని, గుర్తిస్తున్నందుకు ప్రజలకు కూడా తెలిసి వస్తోంది. పదేళ్ల పాలనో కెసిఆర్ తెలంగాణను ఆగం చేశారని, దోపిడీ చేశారని, ఎక్కడా అభివృద్ధి జరగలేదని కవిత పర్యటనల ద్వారా నిత్యం తెలుసుకుంటున్నాం. ఆనాడు నాకు ఎలాంటి అధికారం లేదని, ఒక్క టీచర్‌ను కూడాబదిలీ చేయించుకునే అవకాశం రాలేదని వలపోస్తున్నారు. బీఆర్ఎస్ నేతలపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఆమె ఇప్పుడు ఒక సంచలన నాయకురాలిగా మారారు. అయితే ఆమె ఆరోపణలు, విమర్శలు తండ్రి పార్టీని మరింతగా దెబ్బతీస్తా యన్నది నిజం. అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారుతాయన్నది కూడా అంతే నిజం. కాళేశ్వరం నుంచి కూకట్‌పల్లి భూకబ్జాల దాకా తీవ్ర ఆరోపణలు చేస్తూ ఆమె ఒక సంచలన నాయకురాలిగా మారి పోయారు. బిఆర్ఎస్‌లో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేల భూదందాలు, అక్రమాలపై విరుచుకు పడుతున్న తీరుతో ఆమె ప్రజల్లో మళ్లీ కొంత సానుభూతిని పొందే ప్రయత్నాల్లో సాగుతున్నారు. అయితే లిక్కర్ స్కామ్‌తో కవిత పొలిటికల్ కెరీర్‌కు కాస్త ఇబ్బంది ఏర్పడింది. అప్పటికే కేసీఆర్ పదేండ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఇలా ఎవరికి వారు స్వార్థ రాజకీయాలకు తెలంగాణను బలి తీసుకున్నారు. అందుకేనేమో ఇప్పుడు కవిత వ్యాఖ్యలు సంచలనం కలిగిస్తున్నాయి. మొదటి నుంచి కూడా పార్టీలో తనకు ప్రాధాన్యమిచ్చేవారు కాదని కవిత చెపుతోంది. ఎంపీగా ఉన్నపుడు తనను నిజామాబాద్‌కు మాత్రమే పరిమితం చేశారని చెపుతోంది. నేటి కాలంలో వారసత్వాలు లేని రాజకీయాలు నడవడం లేదు. కెసిఆర్ కూడా అందుకు అతీతుడు కాదని నిరూపించుకున్నారు. బీజేపీ, కమ్యూనిస్టులు మాత్రమే ఇందుకు భిన్నంగా ఉంటారు. కిందిస్థాయిలో ఆ పార్టీ నేతల వారసలు కూడా ఇప్పుడిప్పుడు మెల్లగా బయటకు వస్తున్నారు. భారతదేశంలో ఏ పార్టీ వారసత్వ రాజకీయాలకు అతీతం కాదు. కాకపోతే, ఒకే కుటుంబంలో కొడుకు, కూతురు, మేనల్లుడిని ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకుని వచ్చారు. తన బందు గణాన్ని కూడా తెచ్చి పెట్టుకున్నారు. తన కులం వారికి అగ్ర తాంబూలంఇచ్చారు. ఎక్కడెక్కడో ఉన్న వారిని ముందువరసలో పెట్టారు. ఇలా మొత్తం ఒకే కులం వారు గత పదేళ్లపాటు డామినేషన్ చేశారు. ఇప్పుడు అదే దెబ్బకొట్టింది. అదే అధికారాన్ని దూరం చేసింది. చివరకు కెసిఆర్‌కు వారసుల నుంచే సమస్యలు ఎదురవుతున్నాయి. కేసీఆర్ అడ్డదిడ్డంగా సంపాదించినర సంపదలో వాటా వివాదం కారణంగానే కవితను బయటకు పంపారని అంటున్నారు. సిఎం రేవంత్ రెడ్డి అయితే పదేపదే ఇదే చెబుతున్నారు. గత ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి తమ పార్టీవారే తనను కావాలని ఓడించారని ఇప్పుడు కవిత చెపుతోంది. మంచి వక్తగా పేరున్న కవిత బాగా సంపాదించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తనకేమీ తెలియదని ఇప్పుడు చెబుతున్నాక్షేత్రస్థాయిలో ఆమెను దగ్గరగా చూసిన వారు మాత్రం నిజమేమిటో తెలుసుకోగలరు. లిక్కర్ కేసు ద్వారా ప్రతిష్ట దెబ్బతిన్నదన్నది నిజం. తిరిగి పరువు కాపాడుకోవాలనే ఆరాటం కవితలో బాగా కనిపిస్తోంది. అందుకే జాగృతి జనంబాట పట్టారు. రాజకీయాల్లో అపవాదుకు గురైనపుడు, కుటుంబం దూరం పెడుతున్నపుడు, తనకు మిగిలింది రాజకీయ మార్గమే అని కవిత భావించి ఉంటుంది. ఆమె చేపట్టిన తిరుగుబాటు రాజకీయం తండ్రి పార్టీని దెబ్తీస్తుందని తెలిసినా , తన రాజకీయ ఎజెండా కోసం ఆమె దేనినీ లెక్క చేయడం లేదని కనిపిస్తోంది. కాళేశ్వరంలో జరిగిన అవినీతికి హరీశ్‌రావే కారణంగా ఆమె చేసిన విమర్శలు సంచలనంగా మారాయి. ఎవ్వరినీ వదలకుండా అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. తాను మాత్రం కడిగిన ముత్యం అని చెప్పుకునే ప్రయత్నం కూడా చేస్తున్నారు. కెసిఆర్ కూతురుగా రాజకీయాల్లోకి వచ్చిన కవిత ఇప్పుడు తనకుతానుగా రాజకీయంగా నిలదొక్కుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఆమె ఏమేరకు విజయం సాధిస్తారన్న చూడాలి. అయితే తెలంగాణ వేదికగా రాజకీయ పార్టీలు విన్యాసం చేస్తున్నాయి.

# లేబర్ కోడుల ను రద్దు చేయాలి

### - జీ ఎల్ బి కే ఎస్ అర్జీ కార్యదర్శి ఈదునూరి రామకృష్ణ డిమాండ్



తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని, మార్చ్ 10: గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం ఆర్ జీవన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో 1.ఇంక్లైన్, 2, 2ఏ. ఇంక్లైన్, 11ఏ . ఇంక్లైన్ గనుల మేనేజర్లకు నాలుగు లేబర్ కోర్టులను సింగరేణిలో అమలు చేయకూడదని కోరుతూ వినతి పత్రాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గాని కార్మిక సంఘం (ఇఫ్టు) రామగుండం రీజియన్ కార్యదర్శి ఈదునూరి రామకృష్ణ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి స్థానములో తెచ్చిన నాలుగు లేబర్ కోడులను ఏప్రిల్.1 నుండి అమలు చేయాలని గెజిట్ విడుదల చేసిందని ఈ నాలుగు లేబర్ కోడులకు వ్యతిరేకంగా జరిగిన దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికుల పాల్గొని తీవ్ర నిరసనను, వ్యతిరేకతను తెలిపారని, లేబర్ కోడులు కార్మికుల ఎంతో నష్టకరమైనవని నాలుగు లేబర్ కోడుల పై కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో సమగ్ర చర్చలు జరుపకుండా కార్మిక సంఘాలతో చర్చించకుండా రాష్ట్ర ప్రభుత్వాలకు అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా అమలు చేయాలని చెప్పడం కార్పొరేట్లను సంతృప్తి పరచడానికే అని అన్నారు. దేశంలో కార్మిక వర్గాన్ని పెట్టుబడి దారులకు కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడలను సింగరేణిలో అమలు చేయవద్దని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జీ ఎల్ బి కే ఎస్ (ఐ ఎఫ్ టీ యు) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ నరేష్,రామగుండం రీజియన్, డివిజన్ నాయకులు ఐ రాజేశం,ఎస్ ప్రసాద్, చింతల శేఖర్ , సుతారీ రాజేందర్, బొట్టు వెంకటేష్ పాల్గొన్నారు.


# ఘనంగా సావిత్రిబాయు వర్ధంతి



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మార్చ్ 10: సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా సింగరేణి బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ అర్.జి.1 ఏరియా ఆధ్వర్యంలో జియం కార్యాలయం నందు జరిగిన కార్యాక్రమానికి కె. చంద్రశేఖర్ యస్.ఓ.టు జియం ముఖ్య అతిథిగా హాజరై సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళు లు అర్పించడము జరిగినది. ఈ సందర్భంగా యస్.ఓ.టు జియం మాట్లాడుతూ భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన సావిత్రిబాయి పూలే కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణిగా సావిత్రి భాయి పులే గారి ఆశయాలను కొనసాగించాలని ప్రసంగించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమములో డిజియం ఫైనాన్స్ ధనలక్ష్మి భాయి, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఎకౌంట్ ఆఫీసర్ మోహన్ రావు, సింగరేణి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి వి.దేవచారి ఫిట్ సెక్రటరి పల్లె అంజయ్య, , పర్సనల్ మేనేజర్, అధికారులు సౌమ్య, రాజన్న, వేణు, శ్రావణ్ కుమార్, హనుమంతరావు జియం కార్యలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# కొలనూరు ఆర్ఓబీ మంజూరు

### - ఓదేలు ప్రాంతానికి కూడా సాధిస్తాం: ఎంపీ వంశీ కృష్ణ



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మార్చ్ 10: పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ కొలనూరు ప్రాంతానికి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ మంజూరు కావడం ప్రాంత ప్రజలకు ఆనందకరమైన విషయమని తెలిపారు. కొలనూరు మరియు ఓదేలు ప్రాంతాల్లో రైల్వే గేటు కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు. రైల్వే అధికారులు కొలనూరు ప్రాంతాన్ని సందర్శించినప్పుడు తాను స్వయంగా వారితో కలిసి ఆన్‌సైట్ పరిశీలన నిర్వహించానని, ఆ సమయంలో ఓదేలు ప్రాంతానికి కూడా అత్యవసరంగా ఆర్‌ఓబీ అవసరమని వివరించామని ఆయన పేర్కొన్నారు. మొదటగా రైల్వే శాఖ కొలనూరుకు మాత్రమే ఆర్‌ఓబీ మంజూరు చేసి, ఓదేలు ప్రాంతానికి సాధ్యం కాదని తెలిపిందన్నారు. అయినప్పటికీ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తాను నిరంతరం ప్రయత్నాలు కొనసాగించానని ఎంపీ వంశీ కృష్ణ తెలిపారు. రైల్వే శాఖకు పలుమార్లు లేఖలు రాసి, రిప్రెజెంటేషన్లు ఇచ్చిన ఫలితంగా కొలనూరు ప్రాంతంలో రైల్వే శాఖ స్వంత ఖర్చులతో ఆర్‌ఓబీ నిర్మాణానికి అంగీకరించిందని ఆయన చెప్పారు. అదే విధంగా ఓదేలు ప్రాంతానికి కూడా ఆర్‌ఓబీ మంజూరు అయ్యేలా కృషి కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. రెండు ప్రాంతాల్లో ప్రజల సమస్యలు శాశ్వతంగా పరిష్కారం కావడానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. కొలనూరు గ్రామ ప్రజలకు ఆర్‌ఓబీ మంజూరు కావడం పట్ల ఆయన అభినందనలు తెలియజేశారు. త్వరలోనే పనులు ప్రారంభమై పూర్తి అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## అర్హులైన ఏ ఒక్క ఓటరునూ తొలగించం: సీఈసీ జ్ఞానేశ్ కుమార్

కోల్‌కతా: ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఏ ఒక్క ఓటరును తొలగించేది లేదని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో స్వేచ్ఛగా, సజావుగా, ప్రశాంతంగా ఎన్నికలు జరపడానికే ఎన్నికల సంఘం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈసీ ఆదేశాల మేరకు పనిచేయాల్సి ఉంటుందని, ఎలాంటి లోటుపాట్లను సహించేది లేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీలు, అధికారులతో వరుస సమావేశాల అనంతరం మీడియాతో సీఈసీ మంగళవారంనాడు మాట్లాడారు. పశ్చిమబెంగాల్‌లో 80,000 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వీటిలో 61,000 బూత్‌లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయని సీఈసీ చెప్పారు. ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకత, అవకతవకల నిరోధానికి అన్ని పోలింగ్ బూత్‌లలో వెబ్‌కాస్టింగ్ ప్రక్రియ అమలు చేస్తామని తెలిపారు. రాజ్యాంగం ప్రకారమే ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించామని, పూర్తిగా పారదర్శకతంగా జరిగిందని తెలిపారు. ఢిల్లీ వెళ్లిన తర్వాత ఎన్నికల కమిషన్ సమీక్షా సమావేశం జరుపుతుందని చెప్పారు. కాగా, ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించేందుకు వచ్చిన సీఈసీకి మంగళవారంనాడు కూడా నిరసనల సెగ తప్పలేదు. మంగళవారం ఉదయం దక్షిణేశ్వర్ కాళి ఆలయాన్ని సందర్శించేందుకు ఆయన వచ్చినప్పుడు కొందరు నల్లజెండాలతో నిరసన తెలుపుతూ 'గో బ్యాక్' నినాదాలు చేశారు. ఆదివారం రాత్రి సీఈసీ రాక సందర్భంగా నేతాజి సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం బయట కూడా ఇలాంటి నిరసన ప్రదర్శనలు చేటుచేసుకున్నాయి.



# డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఇద్దరు వ్యక్తులకు 3 రోజుల జైలు శిక్ష



తెలంగాణ అవతరణ, మార్కండేయ కాలనీ, మార్చ్, 10: రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్‌డ్రైవ్ లో దొరికిన 17 మందిని, సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ గోదావరిఖని, వెంకటేష్ దుర్వ ముందు హాజరుపరుచగా 15 గురికి 30,000/- రూపాయల జరిమానా విధించారు. ఇద్దరి వ్యక్తి కి రెండవసారి పట్టుబడగా 3 రోజుల జైలు శిక్షవిధించారు. ఒక వ్యక్తి గోదావరిఖనిలో ఆటో డ్రైవర్ గా పనిచేస్తూ ఉన్నాడు, మరొక వ్యక్తి ఎన్టీపీసీ పవర్ ప్లాంట్ లో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. వీరిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించడం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... వాహనం మద్యం తాగి వాహనం నడప రాదని నడిపినచో వారిపై చట్టరీత్యా చర్య తీసుకోవడం జరుగుతుందని, వాహనానికి సంబంధించిన పత్రములు మరియు టూ వీలర్ వెహికల్స్ నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సిఐ తెలియజేయడం జరిగింది.

# రామగుండంలో ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మార్చ్ 10: రామగుండం నియోజకవర్గం రామగుండం మసీద్ టర్నింగ్ జమ మజీద్‌లో పవిత్ర రంజన్ నెల సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరుల కోసం ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొని మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్క ముస్లిం సోదర, సోదరీమణులకు శాంతి, సౌఖ్యాలు కలగాలని, సమాజంలో సౌభ్రాతృత్వం మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ అల్లాను ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గౌరవ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపల్లి ఎల్లయ్య కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు మజీద్ పెద్దలు తదితరులున్నారు.

## ప్రపంచవ్యాప్తంగా "ఇంధన సంక్షోభం"..

**న్యూఢిల్లీ,మార్చి,10:**మధ్యప్రాచ్యంలోని యుద్ధం ఇతర దేశాలను "ఇంధన సంక్షోభం"లోకి నెడుతోంది. భారత్ ఇతర దేశాలతో పోలిస్తే చాలా నయంగా కనిపిస్తోంది. కానీ 9 దేశాలు మాత్రం ఇంధన సంక్షోభంతో అల్లాడుతున్నాయి. కిస్తాన్, ఫ్రాన్స్, యునైటెడ్ స్టేట్స్, జర్మనీ, పోలాండ్, వియత్నాం, బంగ్లాదేశ్, శ్రీలంక, ఇండోనేషియా దేశాలు తీవ్ర ఇంధన కొరతను ఎదుర్కొంటున్నాయి. ఇరాన్ యుద్ధం ప్రపంచ సప్లై చైన్‌ను దెబ్బతీసింది. హోర్ముజ్ జలసంధి మూసేయడంతో చమురు ధరలు 25 శాతంవరకు పెరిగాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆయా దేశాల ప్రభుత్వాలు ఇంధన సరఫరాలో రేషన్ విధిస్తున్నాయి. పాఠశాల్ని మూసే యడం,ప్రభుత్వా కార్యాలయాలను మూసేయడం వంటి చర్యలు తీసు కుంటున్నాయి. ఇంధనాన్ని ఆదా చేయాలని ప్రయత్నిస్తున్నాయి.



# నగరాన్ని వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగస్వాములు కావాలి

## - రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మార్చ్ 10: నగరాన్ని విద్య,వైద్య,వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నశీలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రామగుండం శాసన సభ్యులు ఎం .ఎస్. రాజ్ ఠాకూర్ కోరారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళ వారం 19 వ డివిజన్ అల్లూరు, సంతోష్ నగర్ లో, 38 వ డివిజన్ సీతా నగర్ లో నిర్వహించిన కార్యక్రమాల్లో నగర మేయర్ మహంకాళి స్వామి , అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , కమిషనర్ అరుణ శ్రీ తో కలిసి పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ బొందల గడ్డ గా మారిన రామగుండం నగరాన్ని పునర్నిర్మాణం చేసి అద్భుత నగరంగా తీర్చి దిద్దడమే ధ్యేయంగా విమర్శలను లెక్క చేయకుండా ముందుకు సాగుతున్నామని అన్నారు . ప్రతి ఒక్కరూ ఈ ప్రయత్నంలో తమ వంతు సహకారం అందించాలని కోరారు. రామగుండం నగరానికి మరో రెండు కొత్త భారీ పరిశ్రమలు రానున్న నేపథ్యంలో ఐదు లక్షల జనాభా తో ఒక మహా నగర స్థాయికి చేరుకుంటుందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వం , ప్రైవేటు రంగంలో లక్షలాది ఉద్యోగావకాశాలు కల్పించారని అన్నారు. రామగుండం నగరంలో కూడా ఉద్యోగ , ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి అనేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ , ఎ టి సి , పి జి కళాశాల , నర్సింగ్ కళాశాల తో పాటు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ కూడా ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు పెంపొందిస్తున్నట్లు తెలిపారు. స్వశక్తి మహిళలు స్వయం ఉ పాధి యూనిట్లు స్థాపించడానికి కోట్లాది రూపాయల సబ్సిడీ రుణాలు తమ ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు. స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనను ప్రోత్సహించడానికి రామగుండం లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అల్లూరు , సంతోష్ నగర్ లలో డ్రెయిన్ లపై నిర్మించిన అనధికార కట్టడాలను తొలగించి నీళ్ళు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే ఎన్ టి ఆర్ నగర్ , కళ్యాణ్ నగర్ , సీతా నగర్ ల నుండి ప్రవహిస్తున్న పెద్ద కాలువ శుభ్రంగా తీర్చి దిద్దడంతో పాటు ప్రక్కన రోడ్డు నిర్మించే యోచన కూడా చేస్తున్నామని అన్నారు. అలాగే స్వంత స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు , స్థలం లేని పేద వారికి స్థలంతో పాటు ఇండ్లు కూడా మంజూరు చేస్తామని అన్నారు. సింగరేణి స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి పట్టాలు కూడా ఇప్పిస్తామని అన్నారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని హాజరైన వారితో నగర మేయర్ మహంకాళి స్వామి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలలో చెత్త వేయడం వలన దోమలు పెరిగి అనేక వ్యాధుల బారిన పడుతున్న విషయం గ్రహించాలని అన్నారు. నగర పాలక సంస్థ స్వచ్ఛ వాహనాలకే చెత్త అందించి సహకరించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని సహకరించాలని కోరారు. ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ నేతృత్వంలో 800 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక లో భాగంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలతో పాటు మునిసిపల్ సేవలకు సంబందిశీచి ఇతర సమస్యలు, పెండింగ్ ఫైళ్ళ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపి రామగుండం నగరాన్ని రాష్ట్రంలో ఆదర్శ నగరంగా రూపొందిస్తామని అన్నారు. నగర పాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని అన్నారు. కాగా ఈ సంధర్భంగా మిషన్ భగీరథ విభాగం ఆద్వర్యంలో విలీన గ్రామం వెంకట్రావ్ పల్లి కుమార స్వామి నగర్ లో నిర్మించిన ఉపరిత వాటర్ ట్యాంక్ ను మేయర్ మహంకాళి స్వామి తో కలిసి ఎం .ఎల్ .ఎ . ఎం ఎస్. రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. అల్లూరు ,సంతోష్ నగర్ లో కాలువలను పరిశీలించారు . సీతా నగర్ లో చెత్త విభజన , సేకరణ పై అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్య , కార్పొరేటర్లు మారెల్లి సుశీలా రాజి రెడ్డి , నెలకశీటి రాము , బుర్ర శశికళ , నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎస్ ఇ గురువీర ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. వి రామన్ ,మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో న్యాయాధికారులను అనుమానిస్తే

# సహించేది లేదు: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో ఎస్ఐఆర్ పక్రియలో న్యాయాధికారులను అనుమానించడంపై సుప్రీంకోర్టు మంగళవారంనాడు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. న్యాయవ్యవస్థపై అనుమానాలు వద్దని, న్యాయాధికారులు ఓవర్ టైం పనిచేసి ఓటర్ల జాబితాను పరిశీలిస్తుంటే వారిపై అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదని సీజేఐ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. జ్యుడిషియల్ అధికారులను కోర్టు నియమించడంపై ప్రశ్నలు లేవనెత్తుతూ దాఖలైన తాజా పిటిషన్లపై విచారణ సందర్భంగా సీజేఐ మండిపడ్డారు. 'న్యాయాధికారులను ప్రశ్నించే సాహసం చేయవద్దు. ఇంతకంటే వాళ్ల నుంచి ఎలాంటి త్యాగాలు మీరు కోరుకుంటున్నారు? తొలిగించిన ఓటర్లకు సంబంధించిన కేసులను పరిశీలించేందుకు న్యాయాధికారులు ఓవర్ టైమ్ పనిచేస్తున్నారు. వారిని అనుమానించే చర్యలను సహించేది లేదు' అని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి తమను తొలగించారంటూ వస్తున్న అభ్యర్థనలను పరిశీలిస్తున్న న్యాయాధికారులకు తగిన లాజిస్టిక్ సపోర్ట్ అందించాలని ఎన్నికల కమిషన్, మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. ఓటర్లను భారీగా తొలగిస్తున్నారనే ఆరోపణలపై బెంగాల్ ప్రభుత్వం, ఈసీ మధ్య జరుగుతున్న పోరును చూస్తే ఇరువర్గాల మధ్య విశ్వాస లోటు ఉందనిపిస్తోందని కూడా కోర్టు అభిప్రాయపడింది. హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులతో అప్పిలేట్ ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు తాజా ఆదేశాల్లో పేర్కొంది. జ్యుడిషియల్ అధికారులు నిరాకరించిన ఓటర్లు ఈ ట్రిబ్యునల్స్‌కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపింది. ట్రిబ్యునల్స్‌కు సేవలందించేందుకు అంగీకరించిన మాజీ ప్రధాన న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులకు గౌరవ వేతనాన్ని నిర్ణయించాలని కోల్‌కతా హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను సుప్రీంకోర్టు కోరింది. ఎన్నికల కమిషన్‌తో సంప్రదించి గౌరవ వేతానాన్ని నిర్ధారించాలని, ఈసీ దానిని చెల్లిస్తుందని తెలిపింది.

# దేశంలో గ్యాస్ సంక్షోభం లేదు..

### వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

### 10 శాతం మేర ఉత్పత్తి పెంచాలని ఇంధన ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు

### భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయన్న కేంద్రం



**న్యూఢిల్లీ,మార్చి,10:**వంటగ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వంటగ్యాస్‌ను బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో 10 శాతం మేర ఉత్పత్తిని పెంచాలని ఇంధన ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఇంధన ఉత్పత్తిపై ఆందోళనలు రేకెత్తుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక భేటీ నిర్వహించారు.ఇరాన్ యుద్ధం దేశ ఇంధర రంగంపై ప్రభావం చూపుతోంది. మధ్యప్రాచ్యం నుంచి చమురు రవాణాకు అత్యంత కీలకంగా ఉన్న "హోర్ముజ్ జలసంధి"ని ఇరాన్ మూసేయడంతో భారత్‌తో సహా ఆసియా, ఇతర దేశాలు సంక్షోభం వైపు పయణిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు, ఇరాన్ గల్ఫ్ దేశాలైన కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈలలోని చమురు, గ్యాస్ క్షేత్రాలపై దాడులు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా దేశాలు ప్రొడక్షన్ నిలిపేశాయి. దీంతో, దేశంలో ఇంధన భయాలు పెరిగాయి. ఇదిలా ఉంటే, దేశంలో గ్యాస్ కొరత లేదని మరియు వాణిజ్య సిలిండర్ల కొరత గురించి ఆందోళనలు తలెత్తిన తర్వాత సరఫరాలు స్థిరీకరించబడ్డాయని ప్రభుత్వం మంగళవారం తెలిపింది. గతంలో జారీ చేసిన ఆదేశాలను అనుసరించి, చమురు శుద్ధి కర్మాగారాలు ఉత్పత్తిని దాదాపు 10% పెంచాయనే గుడ్‌న్యూస్ చెప్పింది. ఇదే కాకుండా గ్యాస్ కృత్రిమ కొరతను నివారించేందుకు గ్యాస్ బుకింగ్స్ కాలాన్ని 25 రోజులకు పెంచినట్లు చెప్పింది. అక్రమ స్టోరేజ్‌ను అరికట్టడానికి, పంపిణీని నిర్ధారించడానికి ప్రభుత్వం నిత్యవసర చట్టం కింద నిబంధనల్ని అమలు చేసిందని అధికారులు చెప్పారు. తాత్కాలిక ఆందోళన్ని ప్రభుత్వం పరిష్కరించిందని, ఇప్పుడు పరిస్థితిని పరిష్కరించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అన్ని రిఫైనరీలు ప్రస్తుతం 100 శాతం సామర్థ్యంతో పనిచేస్తున్నాయని చెప్పారు. భారత్ ఇతర దేశాలతో పోలిస్తే ఇంధన విషయంలో చాలా మెరుగైన స్థితిలో ఉందని వెల్లడించారు.

## కార్మికుల సంక్షేమానికి

# మొదటి ప్రాధాన్యత

### - విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు

### - యువతకు నైపుణ్య శిక్షణలో ప్రాధాన్యం

### - కార్మిక శాఖామంత్రి వివేక్ వెంకటస్వామి



హైదరాబాద్, మార్చి 10:కొత్త యుగ సాంకేతిక పరిజ్ఞానాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాలు అందించి ఉపాధి శిక్షణకు ప్రాధాన్యత ఇస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల (ఏటీసీ) ద్వారా యువతకు ఆధునిక పరిశ్రమలకు అవసరమైన కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో బడ్జెట్‌పై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. సంబంధిత శాఖల పనితీరును మరింత బలోపేతం చేయడానికి అవసరమైన నిధులను కేటాయించాలని కోరారు. కార్మిక శాఖ కార్మికుల సంక్షేమం కోసం సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. విదేశీ ఉపాధి అవకాశాలను విస్తరించేం దుకు ఏటీసీలో భాషా శిక్షణ కోర్సులను ప్రారంభిస్తున్నామని భవిష్యత్తులో విదేశీ నియామకాల విషయంలో ఇవి గేమ్ చేంజర్‌గా మారనున్నాయని అభిప్రాయపడ్డారు. ఉపాధి--శిక్షణ శాఖ అధికారులు బడ్జెట్ అవసరాలు, కొత్త ప్రతిపాదనలను వివరించారు. ఈఎస్ఐ శాఖకు సంబంధించి కార్మికులకు సమయానుకూలంగా, నాణ్యమైన వైద్య సేవలు, మందులు అందించడం తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. గనుల శాఖకు సంబంధించిన అంశాలపై చర్చించి ఆదాయ వనరులు, రెవెన్యూ సేకరణకు సంబంధించిన వివరాలను సమర్పించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, కార్మిక శాఖ కమిషనర్ పామెలా సత్పతి, ఆశాఖ డైరెక్టర్ మిస్ కాంతి వెస్లీ, టీజీఎండీసీ డైరెక్టర్ భావేష్ మిశ్రా, గనుల శాఖ కార్యదర్శి ఎన్. శ్రీధర్ మరియు కార్మిక ఉపాధి శాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు

# మార్చి 13న పీఎం కిసాన్ నిధుల జమ!



**న్యూఢిల్లీ,మార్చి,10:**దేశంలోని కోట్లాది మంది అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా 21వ విడత నిధులను మార్చి 13న రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు అధికారిక వర్గాల సమాచారం. ఈ పథకం కింద అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి6,000 చొప్పున మూడు విడతల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు విడుదల కాబోయే 2,000 నగదు నేరుగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుంది. దీనివల్ల దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 11 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. అయితే కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారమే అర్హులైన వారికి ఈ లబ్ధి చేకూరుతుంది. ముఖ్యంగా ఈ–కేవైసీ ప్రక్రియను పూర్తి చేయని రైతుల ఖాతాల్లో ఈసారి నిధులు జమ అయ్యే అవకాశం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. రైతులు పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా బయోమెట్రిక్ లేదా ఓటీపీ ఆధారిత ఈ–కేవైసీని పూర్తి చేసుకోవాలి. దీనితో పాటు, తమ బ్యాంక్ ఖాతాకు ఆధార్ సీడింగ్ అయి ఉండటం మరియు భూమి రికార్డుల ధృవీకరణ పూర్తి కావడం తప్పనిసరి. ఒకవేళ మార్చి 13 తర్వాత కూడా మీ ఖాతాలో డబ్బులు జమ కాకపోతే, రైతులు వెంటనే పీఎం కిసాన్ పోర్టల్‌లోని 'నో యువర్ స్టేటస్' ఆప్షన్‌ను తనిఖీ చేయాలి. ఏవైనా సాంకేతిక లోపాలు ఉంటే, స్థానిక వ్యవసాయాధికారిని కలవాలని లేదా పీఎం కిసాన్ హెల్ప్‌లైన్ నంబర్ 155261 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

# ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌కు ట్రంప్ వార్నింగ్

### అతను ప్రశాంతంగా జీవించలేడు" అంటూ ఘాటు హెచ్చరిక-నియామకంలో తన ప్రమేయం ఉండాల్సిందని వ్యాఖ్య-పెరుగుతున్న అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు



**వాషింగ్టన్,మార్చి,10:**అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారస్థాయికి చేరాయి. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా ఎంపికైన మొజ్తబా ఖమేనీని లక్ష్యంగా చేసుకుని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. "అతను ప్రశాంతంగా జీవించగలడని నేను అనుకోవడం లేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి తర్వాత ఆయన కుమారుడైన 56 ఏళ్ల మొజ్తబా ఖమేనీని కొత్త అధినేతగా ఎన్నుకున్నారు. ఈ నిర్ణయంపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇరాన్ ఈ నాయకుడిని ఎన్నుకోవడంపై నేను సంతోషంగా లేను. అతను ప్రశాంతంగా బతకలేడు" అని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ నియామక ప్రక్రియలో వెనెజువెలా తరహాలోనే తన ప్రమేయం కలిగి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాదు, ఖమేనీ విధానాలు గత పాలకుల మాదిరే కొనసాగితే ఐదేళ్లలో మరో యుద్ధం తప్పదని ట్రంప్ హెచ్చరించారు. "ఆ పదవిలో కొనసాగాలంటే అతను మా అనుమతి తీసుకోవాలి. లేకపోతే ఎక్కువ కాలం ఉండలేడు" అని ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ వ్యాఖ్యానించారు.

## ఆర్థిక ఇబ్బందుల్లో పాకిస్తాన్.. ప్రభుత్వ ఉద్యోగులు, మంత్రులు, ఎంపీల జీతాలు కట్

పాకిస్తాన్ ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. పశ్చిమ ఆసియాలో (మిడిల్ ఈస్ట్) జరుగుతున్న యుద్ధం (ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు) వల్ల ప్రపంచంలో ఆయిల్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇది పాకిస్తాన్ వంటి ఆయిల్ దిగుమతి దేశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. దీంతో ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ఆస్టరిటీ మెజర్స్ (కట్టుబాటు చర్యలు) ప్రకటించారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగుల జీతాలపై కోతలు, ఇతర ఖర్చుల తగ్గింపు ముఖ్యమైనవి. సోమవారం రాత్రి పాకిస్తాన్‌ను ఉద్దేశించి షాబాజ్ షరీఫ్ మాట్లాడుతూ, పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ గల్ఫ్ నుండి చమురు సరఫరాపై ఆధారపడి ఉందని, చమురు ధరల పెరుగుదల కారణంగా త . అయితే, బ్యాంకులు, వాటి ఉద్యోగులకు అదనపు సెలవులు మంజూరు చేయలేదు. ఈ నిర్ణయం వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు, అలాగే ఆసుపత్రులు, అంబులెన్స్ సేవలతో సహా అవసరమైన సేవలకు వర్తించదు.





# సినిమా

నటన రాదు అయిన స్టార్ అయ్యాడు..


## జాన్ అబ్రహంపై రిమీ సేన్ సంచలన వ్యాఖ్యలు





‘ధూమ్’, ‘హంగామా’, ‘ఫిర్ హేరా ఫేరీ’ వంటి సూపర్ హిట్ సినిమాలతో 2000వ దశకంలో బాలీవుడ్ యువతను ఆకట్టుకున్న అందాల నటి రిమీ సేన్ ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉండి దుబాయ్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్థిరపడిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న రిమీ సేన్ తన సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ బాలీవుడ్ స్టార్ హీరో జాన్ అబ్రహం గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. కెరీర్ ప్రారంభంలో జాన్ అబ్రహం ఒక మోడల్ మాత్రమేనని, అతనికి నటన అస్సలు రాదని రిమీ సేన్ స్పష్టంగా చెప్పడం గమనార్హం. అయితే తన పరిమితులను అర్థం చేసుకుని తెలివిగా పాత్రలు ఎంచుకోవడం వల్లే జాన్ అబ్రహం స్టార్ స్థాయికి చేరుకున్నాడని ఆమె వ్యాఖ్యానించారు. తన నటనపై విమర్శలు వచ్చినా వాటికి స్పందించకుండా, తన బాడీ, లుక్స్ హైలైట్ అయ్యేలా ఎక్కువగా యాక్షన్ సినిమాలనే ఎంచుకుని ప్రేక్షకులు వేలెత్తి చూపే అవకాశమే ఇవ్వలేదని, ఇది అతని (స్ట్రాటజీ అని రిమీ సేన్ వివరించారు. ఒక్కసారి క్రేజ్ వచ్చాక కెమెరా ముందు అనుభవంతో మెల్లమెల్లగా నటన కూడా నేర్చుకున్నాడని, తర్వాత నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలు చేయగలిగాడని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం జాన్ అబ్రహం కేవలం నటుడిగానే కాకుండా మంచి బిజినెస్‌మ్యాన్‌గా కూడా ఎదిగాడని, ప్రొడక్షన్ రంగంలోకి వచ్చి కంటెంట్‌కు ప్రాధాన్యం ఉన్న హిట్ సినిమాలను నిర్మిస్తున్నాడని ప్రశంసించారు. 2004లో సంజయ్ గాధ్వి దర్శకత్వంలో వైఆర్‌ఎఫ్ బ్యానర్‌పై వచ్చిన ‘ధూమ్’ సినిమా అప్పట్లో బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిందని, అదే యాక్షన్ ఫ్రాంచైజీకి బీజం వేసిందని రిమీ సేన్ గుర్తు చేశారు. ఆ సినిమాలో అభిషేక్ బచ్చన్ భార్య పాత్రలో రిమీ సేన్ నటించగా, జాన్ అబ్రహం నెగెటివ్ రోల్‌లో అదరగొట్టాడు. ఇక జాన్ అబ్రహం తాజా చిత్రాల విషయానికి వస్తే, చివరిగా ‘టెహ్రాన్’ అనే స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో కనిపించి నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో ప్రేక్షకులను అలరించాడు. ప్రస్తుతం అరుణ్ గోపాలన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘తారిఖ్’ సినిమాలో నటిస్తున్నాడు. ఇదిలా ఉండగా, రిమీ సేన్ తెలుగులో కూడా తన గ్లామర్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. మెగాస్టార్ చిరంజీవికి జోడీగా ‘అందరివాడు’ సినిమాలో నటించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు రిమీ సేన్. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ జాన్ అబ్రహం కెరీర్‌పై కొత్త చర్చకు దారితీస్తున్నాయి.

## చరణ్ పెద్దిలో మృణాల్ స్పెషల్ సాంగ్






సీతా రామం సినిమాతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి మృణాల్ ఠాకూర్, ఇప్పుడు ఓ భారీ చిత్రంలో ప్రత్యేక గీతంలో అలరించనున్నారనే వార్తలు ఫిల్మ్‌నగర్‌లో చక్కర్లు కొడుతున్నాయి. మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం పెద్దిలో ఆమె ఓ ఐటెం సాంగ్‌లో నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ పాట కోసం చిత్ర నిర్మాతలు ఇప్పటికే మృణాల్‌ను సంప్రదించారని, ఇది ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ కావడంతో ఆమె వెంటనే అంగీకరించినట్లు సమాచారం. ఈ ప్రత్యేక గీతాన్ని భారీ హంగులతో, అద్భుతమైన సెట్‌లో చిత్రీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పాట కోసం సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ ఇప్పటికే ఓ హుషారైన ట్యూన్‌ను సిద్ధం చేశారని ఇండస్ట్రీ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

ఇటీవలి కాలంలో అగ్ర కథానాయికలు ప్రత్యేక గీతాల్లో నటించడం ఒక ట్రెండ్‌గా మారింది. తక్కువ రోజుల కాల్షీట్లకు భారీ పారితోషికం లభించడంతో పాటు, యువతలో ఇలాంటి పాటలకు ఉన్న క్రేజ్ దృష్ట్యా స్టార్ హీరోయిన్లు ఐటెం సాంగ్స్‌కు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మృణాల్ హిందీ, తెలుగు భాషల్లో పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. అల్లు అర్జున్–అట్లీ కాంబినేషన్‌లో రానున్న పాన్ వరల్డ్ చిత్రంలో కూడా ఆమె ఓ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే.

## తరుణ్ భాస్కర్ హీరోగా కొత్త ప్రయోగం




‘పెళ్లి చూపులు’, ‘ఈ నగరానికి ఏమైంది?’ వంటి డిఫరెంట్ కాన్సెప్ట్ సినిమాలతో దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తరుణ్ భాస్కర్ ఇప్పుడు హీరోగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన హీరోగా, ఈషా రెబ్బ హీరోయిన్‌గా నటించిన ఫ్యామిలీ కామెడీ ఎంటర్టైనర్ ‘ఓం శాంతి శాంతి శాంతిః’. ఈ చిత్ర ట్రైలర్‌ను తాజాగా విడుదల చేయగా, నేటివిటీ, ఎటకారాలు, రిలేషన్‌షిప్ డ్రామాతో నిండిన ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకుంటోంది. ట్రైలర్‌ను గమనిస్తే, పెళ్లైన తర్వాత భార్యాభర్తల మధ్య సహజంగా వచ్చే చిన్నచిన్న గొడవలు, భర్త ఇగో వల్ల భార్య ఎదుర్కొనే సమస్యలు కథకు కేంద్రబిందువుగా కనిపిస్తున్నాయి.

మీరు లాస్ట్ చూసిన సినిమా ఏది?” అంటూ పెళ్లి చూపుల సన్నివేశంతో ప్రారంభమయ్యే ట్రైలర్, ఆ తర్వాత చేపల పేర్లతో సాగే హాస్యభరితమైన సీన్స్‌తో ప్రేక్షకులను నవ్విస్తుంది. పెళ్లికి ముందు, తర్వాత వచ్చే మార్పులు, భర్త పెత్తనం చెలాయించాలనుకోవడం, ఆ ఇగోతో ఇబ్బంది పడే భార్య చివరకు ఎలా స్పందించింది? అనే కొత్త కోణంతో కథను నడిపించినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. ఎంత కొట్టినా, ఎంత భరించినా చివరకు భార్య ఒక్కసారి తిరగబడితే పరిస్థితి ఎలా మారుతుంది? భర్త ఈగోకు భార్య ఇచ్చే సమాధానం ఏంటి? అన్నదే ఈ సినిమా ప్రధానాంశంగా కనిపిస్తోంది. ముఖ్యంగా “మన గోదారోళ్లకు ఎటకారాలు సూటైనట్టు ప్రతీకారాలు సూట్ కావురా” అంటూ బ్రహ్మాజీ చెప్పే డైలాగ్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలుస్తూ సినిమాపై అంచనాలను పెంచుతోంది. కామెడీతో పాటు ఎమోషన్‌ను బ్యాలెన్స్ చేస్తూ, కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే కథతో ‘ఓం శాంతి శాంతి శాంతిః’ తెరకెక్కినట్లు తెలుస్తోంది.

దర్శకుడిగా తనదైన శైలితో అలరించిన తరుణ్ భాస్కర్, హీరోగా కూడా అదే నేచురల్ యాక్టింగ్, టైమింగ్‌తో మెప్పించనున్నాడనే అభిప్రాయం ట్రైలర్ చూస్తే కలుగుతోంది. భార్యాభర్తల మధ్య జరిగే ఈ సరదా, సీరియస్ సంగతుల మేళవింపు చివరకు ఏ మలుపు తిరుగుతుందో తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే అన్న ఆసక్తిని ట్రైలర్ ప్రేక్షకుల్లో కలిగిస్తోంది.

## ఎఐ మార్ఫింగ్ ఫోటోలతో నష్టం



తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న ఎఐ మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన ఈ నకిలీ ఫోటోలు తనను మానసికంగా బాధిస్తున్నాయని కీర్తి తెలిపింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది. మార్ఫింగ్ చిత్రాలు నా మనసుకి చాలా బాధ కలిగించడమే కాకుండా.. చాలా విసుగు పుట్టిస్తున్నాయి. ఈ కృత్రిమ మేధస్సుతో క్రియేట్ నకిలీ చిత్రాలు ఎంత నమ్మేలా ఉన్నాయంటే వాటిని చూసినప్పుడు నిజంగానే నేను అలా ఫోజు ఇచ్చానా? అని తనకు తాను ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చిందని కీర్తి పేర్కొన్నారు. ఇది ఎఐ సాంకేతికత ఎంత ప్రమాదకరంగా మారిందో తెలియజేస్తుందని కీర్తి తెలిపారు. ఎఐ సాంకేతికత సామర్థ్యాలు నానాటికీ పెరుగుతున్నాయని వీటిని నియంత్రించడం కష్టంగా మారుతోందని కీర్తి సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా తమ ఇమేజ్‌లను దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని. ఈ సమస్య కేవలం సినీ పరిశ్రమకు మాత్రమే పరిమితం కాలేదని సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఉండే ఎవరికైనా ఇది ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని కీర్తి హెచ్చరించారు. ఇక కీర్తి సురేష్ ఆవేదనకు మద్దతుగా నటి ఆండ్రియా జెరెమియా కూడా ఎఐ వల్ల కలిగే నష్టాల గురించి మాట్లాడారు. నటులకే కాదు, సామాన్య ప్రజలకు కూడా ఎఐ సమస్యగా మారుతోంది. రష్మిక మందన్న, సమంత వంటి పలువురు నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ లేదా మార్ఫింగ్ చిత్రాల బారిన పడ్డారు. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా దీనిపై గళం విప్పడం, ఎఐ దుర్వినియోగం పై మరింత కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

## మగాళ్ల మీద జాలిపడేదెవ్వరు అంటోన్న కీరవాణి.. ‘పురుష’ సాంగ్

పవన్ కళ్యాణ్ హీరోగా గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్న చిత్రం పురుష. సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని సుధీర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రతీ మగాడి యుద్ధం (విజయం) వెనుక ఓ ఆడది ఉంటుంది. స్వేచ్ఛ కోసం భర్త చేసే అలుపెరుగని పోరాటం.. దమ్ముంటే నన్ను టచ్ చెయి అంది. ఒక్క రాంగ్ బటన్ నొక్కితే రిజల్ట్ ఇలా ఉంటుందా భయ్యా అంటూ రిలీజ్ చేసిన పోస్టర్లు ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతున్నాయి.ప్రతీ పోస్టర్‌తో క్యూరియాసిటీ పెంచేస్తున్న మేకర్స్ తాజాగా ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి పాడిన మగాళ మీద జాలిపడేదెవ్వను పాటను విడుదల చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాట మగాళ్లకు కనెక్ట్ అవుతూనే.. ఆడవాళ్లను ఆలోచించేలా చేస్తుందని లిరిక్స్ చెబుతున్నాయి. ఈ పాట సినిమాకే హైలెట్‌గా నిలువనుందని చెప్పకనే చెబుతున్నాయి సాంగ్ విజువల్స్. ఇప్పటికే షేర్ చేసిన పోస్టర్లలో పవన్ కల్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ డిఫరెంట్ అవతారాల్లో కనిపిస్తూ అంచనాలు పెంచేస్తున్నారు. మొత్తానికి బ్రహ్మచారి భర్తగా మారిన తర్వాత



కదనరంగంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయనే నేపథ్యంలో ఫన్నీ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు ఇప్పటివరకు వచ్చిన రషెస్ చెబుతున్నాయి.

## చిరాకు పుట్టిస్తున్న ప్రీరిలీజ్ ఈవెంట్లు

### అవసరానికి మించి పొగడ్తలు అవసరమా నటుడు, దర్శకుడు రవిబాబు



తనకు సినిమాలు మార్కెటింగ్ చేసుకోవడం రాదని నటుడు, దర్శకుడు రవిబాబు తెలిపారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లు చిరాకు తెప్పిస్తాయన్నారు. అలాంటి ఈవెంట్‌లు పెట్టి నటీనటులను అవసరానికి మించి పొగుడుతూనే ఉంటారని అలా ఎందుకు చేస్తారో ఇప్పటికీ తనకు అర్థం కాదన్నారు. అందుకే తాను ఈవెంట్‌లకు రానని చెప్పారు.కొన్ని సినిమాల్లో నన్ను విలన్‌గా చూసినవారు ఇప్పటికీ నేను ఎదురుగా కనిపిస్తే భయంతో వెళ్లిపోతున్నారు. సినిమాలు ప్రేక్షకులపై అంతగా ప్రభావం చూపుతాయి. అందుకే సున్నితమైన అంశాలను తెరకెక్కించేటప్పుడు మరింత జాగ్రత్త వహించాలని రవిబాబు చెప్పారు. తనకు మార్కెటింగ్ చేసుకోవడం తెలియదని దర్శకుడు రవిబాబు అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. హాస్యం కూడా ప్రాంతాన్ని బట్టి మారుతుందన్నారు. అందుకే తాను ఎక్కువగా విజువల్స్‌కు ప్రాధాన్యం ఉండేలా చూస్తానన్నారు. ‘అవును సినిమాలో ఆ హీరోయిన్ పెద్ద ఇబ్బందుల్లో పడుతుంది. దాన్ని విజువల్‌గా ఎలా చూపించాలి అని ఆలోచించి.. ఏనుగు పెద్ద జంతువు కాబట్టి ఏనుగంత ప్రాబ్లమ్‌లో హీరోయిన్ ఉంది అని చెప్పడం కోసం పోస్టర్ చేయించా. ఆ పోస్టర్ చూసి ఒక వ్యక్తి నాకు ఫోన్ చేసి తిట్టాడు. ఏనుగు ఉందని పిల్లల్ని తీసుకొని సినిమాకు వెళ్తే సినిమాలో ఏనుగు లేదన్నాడు. ఆయనకు సారీ చెప్పి పెట్టేశాను. ఈ సినిమా చూసి మరో మహిళ ఫోన్ చేశారు. శరీరం లేని వ్యక్తి, కళ్లకు కనిపించని వ్యక్తి హీరోయిన్‌ను ఎలా కలవాలని అనుకుంటాడు అని నాతో వాదించారు. ఆమెకు నేను ఆ సినిమా కథే అది అని వివరించలేక పోయాను‘. ‘ప్రేక్షకులు మనం తీసే సినిమాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలి.

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209.“
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411